రైతులకు అండగా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌



ఎమ్మెల్యేకు నాగలిని బహూకరిస్తున్న కొత్త యాదగిరిరెడ్డి

శంషాబాద్‌ రూరల్‌: రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్‌ దేశంలోనే మెరుగైన పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని మల్కారం, హమీదుల్లా నగర్‌ రైతు వేదికల్లో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మల్కారంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. వ్యవసాయానికి ఉచిత కరెంటు, రైతు బంధు, రైతు భీమాతో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రైతులకు అండగా ఉందన్నారు. మండల రైతు సంఘం అధ్యక్షుడు కొత్త యాదగిరిరెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నాగలిని బహూకరించారు. అంతకుముందు హమీదుల్లానగర్‌ రైతు వేదికలో సొసైటీ చైర్మన్‌ దొనాకర్‌గౌడ్‌ ఆధ్వర్యంలో రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ,ఎ జడ్పీటీసీ తన్వీరాజు, ఆర్డీఓ చంద్రకళ, సొసైటీ చైర్మన్‌ బి.సతీష్‌, సర్పంచులు మాధవి, సతీష్‌కుమార్‌, చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

తహసీల్దార్‌ కార్యాలయం వద్ద..

రాజేంద్రనగర్‌: దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం రాజేంద్రనగర్‌ తహసీల్దార్‌ కార్యాలయం వద్ద నిర్వహించిన రైతు దినోత్సవంలో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ హాజరయ్యారు. మొదట ఎన్‌ఐఆర్‌డీ చౌరస్తా నుంచి తహసీల్దార్‌ కార్యాలయం వరకు బైక్‌ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో చేసిన అభివృద్ధి, రైతు సంక్షేమ పథకాలను రైతు వేదిక కేంద్రంగా ఆర్డీవోతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశ ఆర్థిక వ్యవస్థకు రైతే వెన్నెముక అన్నారు. వ్యవసాయం అనే జీవన విధానంతో అన్నదాతలు అహర్నిశలు కష్టపడి దేశానికి అన్నం పెడుతున్నారన్నారు. రైతులు దేశానికి చేస్తున్న సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ రైతుల సంక్షేమానికి వారికి ఉచిత కరెంటు, రైతుబంధు, రైతు భీమా పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ అర్చన జయప్రకాష్‌, ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్‌ చంద్రశేఖర్‌గౌడ్‌, వ్యవసాయ శాఖ అధికారులు, డివిజన్‌ అధ్యక్షులు ధర్మారెడ్డి, పలుగుచెరువు మహేష్‌, రగడంపల్లి శ్రావణ్‌, నవీన్‌కుమార్‌ పాల్గొన్నారు.

రైతులకు మేలు చేస్తున్న ప్రభుత్వం..

మణికొండ: దేశంలోనే ఎక్కడా లేని విధంగా రైతులకు రైతుబంధు, రైతు భీమా, 24గంటల ఉచిత విద్యుత్‌, పంటలను ప్రభుత్వమే కొనటం లాంటి అనేక పథకాలతో వారికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మేలు చేస్తుందని బండ్లగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ మేయర్‌ మహేందర్‌గౌడ్‌ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో బాగంగా శనివారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌ గ్రామంలో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రైతులను రాజులుగా చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతులంతా బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి బాసటగా నిలవాలన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..

ఏజీవర్సిటీ: సుస్థిర వ్యవసాయానికి ఆనవాలుగా నేడు తెలంగాణ మారిందని రైతుబంధు, రైతు బీమా, సాగునీరు, నిరంతర విద్యుత్‌, మిషన్‌ కాకతీయ వంటి ఎన్నో చరిత్రాత్మక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టడంతోనే ఇది సాధ్యమైందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌ రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు దినోత్సవం సందర్భంగా జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో 58 శాతం జనాభా వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులకు పురస్కారాలను అందజేశారు.

మున్సిపల్‌ కార్మికులను పర్మినెంట్‌ చేయాలి



మాట్లాడుతున్న యేసు రత్నం

రాజేంద్రనగర్‌: మున్సిపల్‌ కార్మికులను వెంటనే పర్మినెంట్‌ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యేసు రత్నం అన్నారు. రాజేంద్రనగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో రాజేంద్రనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్‌ స్టాఫ్‌ అండ్‌ కాంట్రాక్ట్‌ ఔట్‌ సోర్సింగ్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) రంగారెడ్డి జిల్లా మున్సిపల్‌ కార్మికుల మొదటి మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభకు వనంపల్లి జైపాల్‌రెడ్డి అధ్యక్షతన వహించగా ఏఐటీయూసీ జెండాను రాష్ట్ర అధ్యక్షులు యేసు రత్నం ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వస్తే మున్సిపల్‌ కార్మికులను పర్మినెంట్‌ చేస్తానని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నేటికీ అమలు కావడం లేదన్నారు. ఒరిస్సా రాష్ట్రంలో ముఖ్యమంత్రి చెప్పినట్లుగానే కార్మికులందరిని పర్మినెంట్‌ చేయడం జరిగిందన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో కార్మికులను ఎందుకు పర్మినెంట్‌ చేయడం లేదని ప్రశ్నించారు. పర్మినెంట్‌ చేసేంత వరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. మేడ్చల్‌లో జరిగే మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పానుగంటి పర్వతాలు జిల్లా నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా కాల్వ శంకర్‌, జిల్లా ప్రధాన కార్యదర్శిగా వనంపల్లి జైపాల్‌రెడ్డి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌గా టి.ఆనంద్‌, కోశాధికారిగా ఏ.రాజు, జిల్లా ఉపాధ్యక్షుడిగా చందుయాదవ్‌, జంగయ్య, గణేష్‌, సహాయ కార్యదర్శిలుగా సంజీవ, పరమేష్‌, శ్యామలమ్మ, మొగులమ్మ, కమిటీ సభ్యులుగా నరసింహులు, శాంతమ్మ, కిషన్‌నాయక్‌, కిరణ్‌, ప్రేమ్‌కుమార్‌, సాయిలు, విజయ, నర్సింహులు, దశరథం, టి.బుచ్చయ్య తదితరులను నియమించారు.

కారును ఢీకొట్టి పరార్‌

శంషాబాద్‌: శంషాబాద్‌ విమానాశ్రయం రహదారిలో నిర్లక్ష్యంగా డ్రైవింగ్‌ చేస్తూ ముందు వెళ్తున్న మరో కారుతో ఢీకొన్నారు. అల్వాల్‌కు చెందిన కలీముద్దీన్‌ శంషాబాద్‌ నుంచి ఎయిర్‌పోర్టు వైపునకు కారులో వెళుతుండగా వెనక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో కారు ధ్వంసమైంది. కారులోంచి దిగిన మహిళతో పాటు మరికొందరు వ్యక్తులు కారుకు ఉన్న నంబరు ప్లేట్లను తీసి బాధితుడి తోసి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● గుర్తు తెలియని కారు ఢీ కొని వృద్ధుడికి గాయాలైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పట్టణంలోని ద్వారకా హోండా షో రూం ముందు రోడ్డు దాటుతున్న దేవన్న (60) గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

'రాష్ట్రంలో దళిత వ్యతిరేక పాలన'



మీరాకుమార్‌ను సన్మానిస్తున్న నేతలు

శంషాబాద్‌: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో దొరల రాజ్యం సాగుతోందని పీసీసీ ఎస్సీ సెల్‌ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్‌ లోక్‌సభ మాజీ స్పీకర్‌ మీరాకుమార్‌కు వివరించారు.హైదరాబాద్‌ పర్యటనలో ఉన్న ఆమెను పలువురితో కలిసి సన్మానించి రాష్ట్రంలోని పరిస్థితులను వివరించారు. దళిత ముఖ్యమంత్రి చేస్తానన్న మాటను తప్పిన సీఎం కేసీఆర్‌ అన్ని చోట్లా దళితులను దగా చేస్తున్నారన్నారు. దళితులకు మూడెకరాల పథకం అటకెక్కగా దళిత బంధు పేరుతో చేపడుతున్న పథకం కేవలం బీఆర్‌ఎస్‌ నేతలకు మాత్రమే దక్కుతుందన్నారు. అర్హులైన దళితులకు మొండిచేయి చూపుతున్నారని వివరించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై మరింత విస్తృతంగా పోరాటాలు చేయాలని ఈ సందర్భంగా మీరాకుమార్‌ సూచించినట్లు పీసీసీ ఎస్సీసెల్‌ నేతలు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

శంషాబాద్‌: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనపై ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కర్మన్‌ఘాట్‌కు చెందిన శివకుమార్‌ శుక్రవారం పట్టణంలోని జేడీ కన్వెన్షన్‌లో విందుకు హాజరై భోజనం చేస్తున్నాడు. అదే సమయంలో అతడితో పరిచయం ఉన్న హస్తినాపురానికి చెందిన కంచర్ల శివారెడ్డి (37) తనతో రావాలని కోరగా శివకుమార్‌ నిరాకరించడంతో మద్యం మత్తులో ఉన్న శివారెడ్డి శివకుమార్‌పై దాడికి పాల్పడ్డాడు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

శంషాబాద్‌: ఎయిర్‌పోర్టు విస్తరణ పనుల్లో పని చేయడానికి వచ్చిన ఓ కూలీ అదృశ్యమయ్యాడు. బిహార్‌ రాష్ట్రానికి చెందిన సంతోష్‌ భువియా (40)తో పాటు మరో ముగ్గురు ఐదురోజుల కిందట శంషాబాద్‌ విమానాశ్రయానికి వచ్చారు. ఎయిర్‌పోర్టులో ఎల్‌ అండ్‌ సంస్థ చేపడుతున్న నిర్మాణ పనుల్లో పని మాట్లాడుకుని అక్కడే ఉన్న షెడ్డుల్లో నివాసముంటున్నారు. మే 31 సంతోష్‌ ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి ఎంతకీ రాకపోవడంతో సహచరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా...

తన కారులోనే ఎక్కాలని ప్రయాణికులతో వాగ్వాదం

ఎయిర్‌పోర్టులో డ్రైవర్‌పై కేసు

శంషాబాద్‌: శంషాబాద్‌ విమానాశ్రయంలో ప్రయాణికులకు బలవంతంగా తమ కారులోనే ప్రయాణించాల్సిందిగా ఇబ్బందులకు గురిచేసిన డ్రైవర్‌పై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన డ్రైవర్‌ సంతోష్‌ శనివారం విమానాశ్రయం నుంచి బయటకి వస్తున్న ప్రయాణికులకు తన కారులో ప్రయాణించాల్సిందిగా ఒత్తిడి చేసి ఇబ్బందులకు గురిచేశాడు. ప్రయాణికుల ఫిర్యాదు మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రైతులకు ఏం చేశారని రైతు దినోత్సవం పేరిట సంబరాలు

రాజేంద్రనగర్‌: రైతులకు రుణమాఫీ చేసినందుకా.. ఉచిత ఎరువులు ఇస్తాం అన్న హామీ నెరవేర్చినందుకా.. సీడ్‌ బౌల్‌ ఆఫ్‌ తెలంగాణగా మార్చినందుకా రైతు దినోత్సవం పేరిట సంబరాలు జరిపేది అని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ కార్పొరేటర్‌ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం, రైతు దినోత్సవం సంబరాలు జరుపుతున్నారని, అసలు సంబరాలు జరిపేందుకు ఏం అర్హత ఉదని మండిపడ్డారు. ధరణితో రైతులను ముప్పతిప్పలు పెడుతూ వారిని తహసీల్దార్‌ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వారి భూమిపై వారికే హక్కు లేకుండా చేసినందుకా ఉత్సవాలు అని ప్రశ్నించారు. మద్దతు ధర కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తే వారిపై కేసులు పెట్టి జైళ్లల్లో పెట్టిన చరిత్ర బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానిది అన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ బుద్వేల్‌లోని కుసుమ హరనాథ బాబా మందిర నిర్మాణానికి హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి భూమిపూజ చేశారు. కుసుమ హరనాథ బాబా దేవాలయాన్ని నిర్మించేందుకు దేవాలయ కమిటీతో పాటు స్థానికులు ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.



